దయ్యము

కొ. శశిశేఖరరావు

౧

ఎప్పుడో ఇరవయిసంవత్సరాలనాటి మాట. అప్పటి కింకా యెనిమిదోయేడు గడచిందో లేదో. క్రొత్తసంగతు లేవయినా తెలిస్తే మనస్సులో కదలకుండా నాటుకొనిపొయ్యే యీడు.

నాకు అయిదోసంవత్సరము వెళ్లగానే అక్షరాభ్యాసము చేసినదిమొదలు సీలమండలన్నీ కాయలుకాచేట్లు మహాదీక్షతో అస్తమానమూ బడిలో కూర్చోవటము అలవాటుగావటముచేత స్వేచ్ఛావృత్తి తప్పిపోయింది. ఎంతసేపటికీ పాఠాలన్నీ గబగబా అప్పజెప్పి అందరికన్నా తెలివిగలవాడనని అనిపించుకొనట మెట్లాగా అనే ఆలోచనతప్ప మరేమీ వుండేదిగాదు. అసలు వేరేఆలోచనకు విరామమే వుండేదిగాదు. ఇంతలో మానాయనగారు నా కింగ్లీషుచదువు చెప్పించాలని పక్కబస్తీనుంచి రామయ్యపంతులుగారిని తీసుకువచ్చారు. కొత్తపంతులుధర్మమా అంటూ ఆరెండుమూడునెలలనుంచీ మధ్యాహ్నముపూట రెండుగంటలు ఊపిరిపీల్చటానికి కాస్త ఖాళీ దొరికేది. ప్రొద్దుగూకులూ బడిలోనే కూర్చోవటము అలవాటయిన నా కావిశ్రాంతికాలములో ఏమీ తోచేది కాదు. ఇంటిదగ్గరే కూచుని ఏదో కాలక్షేపము చేసేవాణ్ణి. అవి మామిడిపళ్లరోజులు కావటముచేత కాబోలు, నాకు బళ్లోపిల్లలంతా స్నేహమయినారు; మధ్యాహ్నముపూట ప్రతిరోజూ మాయింటికి వచ్చేవాళ్లు. దక్షిణపుపొలాన మామిడితోపునుంచి తెచ్చి పడమటింట్లో భద్రముగా వరిగడ్డికుమ్ములో ముగ్గవేసిన పీచుమామిడికాయలు నాతోపాటు పిల్లలందరకూ తలాఒకటి పంచిపెట్టేది మాఅమ్మ. తినమరిగిన కొత్తఅల్లుళ్లకుమల్లే పిల్లలు రోజూ రావటము సాగించారు. మామిడికాయలన్నీ వారము రోజులలో ఎగిరిపోయినయి. చివరిరోజు ఒకరిద్దరకు తక్కువయినవని మాఅమ్మ దిగులుపడటము చూసికూడా మర్నాడు అందరూ మామూలువేళకన్నా కాస్త ముందలే ముసురుకున్నారు. మాఅమ్మ జాలిపడి, “నాయనా, ఇవ్వాళ మామిడికాయలు లేవురా. దక్షిణపుపొలాన వీళ్ల నాన్న ఉన్నారుగాని అబ్బాయినిగూడా అక్కడికి తీసుకొనిపోయి నాలుగుకాయలు తినిరండమ్మా!” అని మమ్మందరినీ ప్రయాణముచేసింది. పిల్లలందరూ కొండఎక్కినంత సంతోషపడి ‘సరే’నని బయలుదేరారు. వీధిలోదాక పోయామో లేదో, ఇంతలో మాఅమ్మ తరుముకునివచ్చి, “అబ్బాయి, చెప్పులు తొడుక్కొని పోరా. ఎండలో కాళ్లు మాడిపోతవి” అని పిలిచి నాకు చెప్పులు తొడిగి, మాలోకల్లా కాస్త పెద్దవాడయిన సూరయ్య

తో, " ఒరే అబ్బాయి, తమ్ముడు ఎన్నడూ బయటికి పోయినవాడు కాదుగాని దారిలో భయపడతాడేమో జాగ్రత్తగా తీసుకుపో అమ్మా. దక్షిణపువేపు గమళ్లపాలెములో కుక్కలవీ ఉంటయిగాని జాగ్రత్త బాబూ" అనిభద్రము చెప్పి పంపి, కాస్తదూరము సాగేవరకల్లా వెనకనుంచి, "ఒరేయి, అబ్బాయి బుడిగితోట్లో దడుచుకుంటాడేమో జాగ్రత్తమ్మా. నిమ్మలభావివేపు పోబోకండీ!" అని కేకవేసి చెప్పింది.

బుడిగితోటసంగతి వినగానే పిల్లలందరితో కలిసి కులాసాగా బయలుదేరిన నా గుండెలు 'డక్కు' మన్నయి. మాపొలము పోయే దోవలోనే ఉంది బుడిగితోట. మా నాయనగారితో కలిసి రెండు మూడు సార్లు ఆదోవనే పోయానుగాని, ఆయనప్రక్కన ఉండటముచేతగాబోలు, అప్పుడు అంతభయమనిపించలేదు. ఇప్పుడెందుకో ఊరికే కలవరపడిపోయాను. బుడిగితోటను గురించీ, అందులో ఉండే దయ్యాలనుగుఱించీ మాచిన్నజీతగాడు నా కొకరోజు చెప్పినదంతా తలలో గిఱ్ఱున తిరిగింది. కొద్దిరోజులక్రిందటే ఒక అబ్బాయి అక్కడే దడిసికొని ముంచాన బడి మశూచికము పోసి చనిపోవటము నేను బాగా ఎరిగినసంగతే. పిల్లలతో కలిసి నవ్వుతున్నానన్నమాటేగాని మనస్సు మనస్సులో లేదు. కీకారణ్యముగా ఒకటినొకటి ఒరసికొని పట్టపగలుకూడా చీకట్లు క్రమ్మే ఆ మామిడిచెట్లక్రింద కుక్కిమంచంలో గూర్చుని ముసలిరాట మొకటి త్రిప్పుతూ ఉండే బుడిగమ్మే దయ్యాలతల్లి అని మాబుడ్డజీతగాడు చెప్పిన మాటలు తలపుకు వచ్చి నాచిన్నిగుండెలు తటతటా కొట్టుకొన్నయి

ఇంతలో గమళ్లపాలెము వచ్చింది. అదివరకటిదాకా ఒకమాదిరిగా ఉన్న నా భయ మెక్కువయింది. అక్కడి కుక్క లేమి చేస్తవోనని వణికిపోతున్నాను. నాబోటిగాళ్లే కొంతమంది పిల్లలుకూడా భయపడటమూ, అదివరకంతా వెనకా ముందూ పోయేవాళ్లందరూ ఒకగుంపుగా చేరి, మాటలు తగ్గించి గబగబా నడవటమూ చూసినకొద్దీ, నాకు మరింత భయమయి సూరయ్యవెనకాలనే చేరాను. అతగాడు ఇదే సందనుకొని, "అబ్బాయి, బసివిగాడి కుక్కను చూశావా ఎప్పుడన్నా? అదిగో, అదిగో, ఆపక్కన డొంకలో పరుగెత్తుతుందే అదే. అదిగనక మనుషులిని చూసిందంటే పీకేస్తుంది" అన్నాడు. నే నేమీ మాట్లాడలేకపోయాను. ఇంతలో ఎక్కడిదో ఒకపాడుకుక్కపిల్ల 'ఖైం'మని అరిచింది. సూరయ్య ఒకగడ్డ తీసుకుని కొట్టేవరకు అది పారిపోయింది. మేమంతా నిట్టూర్పువంటి నవ్వు నవ్వాము. "చూశావా, ఏంజేశానో. నీమీదకేకుక్క వచ్చినానకే ఇట్లాగే కొడ్తాను"అని అంటూ సూరయ్య నాదగ్గరకు వచ్చాడు. ఆకుక్కపిల్ల నామీదకే వచ్చినట్లు, నాకోసమయి ప్రత్యేకముగా సూరయ్య దానితో యుద్ధముచేసి ఓడించినట్లు, ప్రస్తుతము సూరయ్యన్నయ్యే సర్వశరణ్యమయినట్లు తోచింది

నాకు. అతనివెంటనే నక్కినక్కి నడవటము మొదలుపెట్టాను. అతగాడు అది కనిపెట్టి మెల్లగా నాతో, "కుక్కలిని కరవకుండా జేస్తాగాని నాకు నాలుగు మామిడికాయ లిస్తావా మరి" అన్నాడు. నేను 'సరే' నని తల ఎగరవేశాను. అతనికి ఉత్సాహ మెక్కువయి అందరికీ వినబడేట్లు పెద్దగా, "ఒరేయి, ఈకుక్కలు మన నేం జేస్తయిరా? చూసుకోండి నాదెబ్బ మరి. బసివిగాడి కుక్క యిందాక నన్ను చూసిగాదూ పారిపోయింది! ఈతడవ కనబడనీ, దాని డొక్క చీల్చేస్తానో లేదో మరి." అని అంటూఉండగానే గమళ్ల పాలెము దాటివచ్చాము.

ఒకగండము తప్పిందిగాని అసలుగండమే ముందున్నది. సూరయ్యగాంభీర్యము చూసి కాస్త తేరుకున్న మనస్సు బుడిగితోట జ్ఞాపకమువచ్చి కలగిపోయింది. ఇకను బుడిగితోట ఎంతో దూరము లేదు. పదిగజాలలోకి వచ్చాము. తోటను సమీపించినకొద్దీ వెనక్కు తిరిగిపోవా లనిపించింది. కాని వాళ్లంతా నవ్వుతారేమోనన్న సిగ్గు, వెనకకు బోతే బసివిగాడి కుక్క ఎదురవుతుందేమోనన్న భయము ముందుకే నడిపించినయి. ఇంతలో సూరయ్య, "ఒరేయి, నిమ్మలభావిలో పాములేమన్నా ఉంటే చంపుదాము పదండిరా" అని మలుపుతిరిగి, కాలిబాట త్రొక్కగానే పిల్లలంతా అనుసరించారు. నాకయితే నిమ్మల భావంటే భయమేగాని బుడిగిని తప్పించుకోవచ్చునుగదాఅని, మాఅమ్మమాట జ్ఞాపకమున్నా, మరచిపోయినట్లే వారివెంబడే పోయాను. అందరూ భావిలో రెండు నీళ్లకొయ్యాలుంటే వాటిని మట్టిగడ్డలతో చంపాలనే ప్రయత్నముమీద ఉన్నారు. నేను దూరంగా నిలిచి వినోదముచూస్తున్నట్లు నటించినా, లోపల 'బిక్కుబిక్కు' మంటూనే ఉంది. ఇంతలోనే ఎక్కడనుంచో 'భౌ' మని అరుపు వినబడింది. మాలోకల్లా చిన్నవాడయిన సాంబయ్య కెవ్వున కేకవేసి, "అమ్మో! బసివిగాడి కుక్కరో!" అని అరుచుకొంటూ బుడిగి తోటవేపు పరుగెత్తాడు. ఇంతలో బసివిగాడి కుక్క రానేవచ్చింది. వెనక్కి తిరిగిచూడకుండా సూరయ్యతోసహా అందరము బుడిగి తోట్లోకి ఉడాయించాము. ఈ గోలంతా విని పిల్లలెవరో మామిడిపళ్ల కెగబడుతున్నారని బొబ్బలుపెడుతూ, ఆదయ్యాల తల్లి బుడిగెమ్మ, మంచంలోనుంచి లేవలేక, మామీద కఱ్ఱవిసిరింది. అప్పుడు బుడిగెమ్మను చూస్తే, నేనేమిటి, ఎవరయినా గుండెలుపగిలి చస్తారు. ఆకన్నులలో దయ్యా లాడినయి. ఆ చింపిరి జుట్టులో భూతాలు నాట్యము చేసినయి. ఆ ముసలి ముడతల్లో పిశాచాలు నవ్వినయి. నాకళ్లు తిరిగినయి. మతి చలించింది. బుడిగెమ్మకఱ్ఱను తప్పించుకోబోయి మామిడివేరు తగిలి క్రిందబడ్డాను.

అంతే, మళ్లా మర్నాటిదాకా నాకు స్పృహలేదు. చావునోట్లోనుంచి తప్పించుకొన్నానుగాని మళ్లా ఆరునెలలదాకా మామూలుమనిషిని కాలేదు. అప్పటినుంచి

దయ్యాలంటే నాకు చెడ్డభయము. దయ్యాలు లేవనే నాస్తికుల వాదాలు నాకు నచ్చవు. ఇక ఈజన్మ కింతే ననుకుంటూ.

౨

మా వూరిలోకల్లా స్కూలుఫయినలు దాకా వెలగబెట్టింది నేనే. అటు పైచదువులకు పనికి రాకుండా, ఇటు వ్యవసాయానికి పనికిరాకుండా, మధ్యస్తంగా వ్రేలాడుతూ, పొలము బుట్టా పాలె కిచ్చి, ఉదయ సాయం సంధ్యలందు తూరుపుబజారులో రావిచెట్టు నీడనున్న భావిబొడ్డుమీదను, మధ్యందినాతప వేళలందు రావిచెట్టు నంటియున్న రచ్చ చావడిలోను, శక్తులు ఉడిగిపోయి, పండి ముగ్గబారిన ముసలివారితో కలసి, ఎలుక మీద పిల్లిఅని, పిల్లిమీద ఎలుకఅని కబుర్లు చెప్పుకొంటూ కాలము వెళ్లబుచ్చటము ఈ పదిసంవత్సరాలనుంచి పరిపాటి అయింది.

ఒకరోజు ఏదో పనుండి పగలంతా బస్తీలో తిరిగి సాయంకాలమయ్యేవరకు ఇల్లు చేరుకున్నాను. త్వరగా మజ్జనభోజనాదులయినవనిపించి, దేహమంతా విరగగొట్టినట్లున్నా, అట్లాగే ఓపికచేసుకొని భావిబొడ్డు మీదికి చేరుకొన్నాను. ఎట్లా మొదలయిందో తెలియదుగాని సాంబయ్య, సూరయ్య పెద్దగా కేకలు వేసుకొంటూ దయ్యాలనుగురించి పూర్వపక్షసిద్ధాంతములు చేస్తున్నారు. దయ్యా లున్నవనేదానికి తార్కాణగా సాంబయ్య, "అదిగో, అమావాస్యనాటి రాత్రి, ఆమర్రిక్రింద పండుకుంటే తెలుస్తుంది ఏసంగతీని" అని, అంతటితో ఊరుకోక ఎప్పుడోకాలమునాడు బుడిగితోటలో నేను భయపడి, జబ్బుపడి, ఆరునెలలదాకా బాగుపడకపోవటము చెప్పాడు. అదివరకంతా ఏదో యాదాలాపముగా వింటూ పడుకున్న నాగుండెలు ఒక్కమారు 'ఝల్లు'మన్నయి. "చల్లనివేళ యీపాడుఆలోచన లేమిటోయ్?" అని సాంబయ్యను కసురుకోగానే వా డూరకున్నాడు. సూరయ్య మరింత రెచ్చిపోతున్నాడు. కొంతసేపటికి సంభాషణక్రమము మారి ఏదోతోటలు, దొడ్లు మాటలు వచ్చినయి. నేను ఊరుకోమనగానే సాంబయ్య దయ్యాలసంగతి మాట్లాడటము మానివేశాడనే ఉడుకు పట్టలేక, సూరయ్య, "ఈయేడు బుడిగితోట ఎవరూ తీసుకోరేమో, దయ్యాలకు భయపడి. ఏం సాంబయ్యా?" అని కుళ్లగించాడు. అంతటితో నాఆలోచనలన్నీ వెనక బుడిగితోటలో నేను పడిపోయిన సందర్భాల వెంబడే పరుగెత్తినయి.

* * * *

అట్లా యెంతసేపు ఆలోచిస్తున్నానో నాకు తెలియకుండానే ఆదమరచి నిద్రపోయాను. ఒకరాత్రివేళ ఎందుకో మెలకువ వచ్చింది. ఊరికి ఉత్తరపువైపున స్మశానము ప్రక్కగా పోయే రాస్తామీద దూరపుఊళ్లు పోతున్న రెండెడ్లబండ్ల గంటలమ్రోతలు ఆకాశమును భేదించుకొనివచ్చి నాచెవులలో గింగురుమన్నయి. ఎక్కడా మనిషి అన్నమాట కనపడలేదు. రెండుఝాములు కావచ్చు నను

కున్నాను. భూతాలు తిరిగేవేళ ఇక్కడ ఎందుకు ఉన్నానా అని జ్ఞప్తికితెచ్చుకోగా సాంబయ్య సూరయ్యల వాదము స్మృతిపథములో తోచింది. నెమ్మదిగా ఇంటికి చేరుకుందామని లేవబోతూఉండగానే ఆమూల పశువులచావడి మొత్తమీద ఉన్న దయ్యాలమఱ్ఱినీడలో పేడకుప్పవద్ద ఏదో కదలిన ట్లయింది. నానవనాడులూ క్రుంగిపోయినయి. ఎరగనట్లుగా కన్నులు మూసుకున్నాను. కాసేపుండి కనురెప్పల సందునుంచి దృష్టి సారించి చూశాను. బయటంతా వెన్నెలయినా, చెట్టుక్రింద నీడగావటముచేత, ఆనీడలో ఉన్న ఆకారము నాకు స్పష్టముగా కనుపించలేదు. మోకాళ్లపైదాకా ఏదో చీర, చింపిరితలమాత్రము కనబడినయి. మళ్లా కళ్లు మూసుకున్నాను. ఇంతలో ఏదో 'తప, తప' మని శబ్దమయింది. ఉలికిపడి కళ్లుదెరచి చూశాను. నీడలో వంగి యేదో దేవులాడుతున్నట్లు కనిపించింది. కళ్లు మూయటానికికూడా శక్తిలేక అట్లనే చూస్తూ పండుకున్నాను. మొత్త దాటి ఏదో చంకన బెట్టుకొని నావేపుకే నడుస్తూఉంది ఆపిశాచి. నాగొంతు ఎండిపోయింది. పొత్తికడుపులో ఏదో 'దడ' మొదలుపెట్టింది. (గుండెకాయ ఏమయిందో నే నెరగను.) పండుకొని ఉన్నా కాళ్లలో నీరసత్వము తోచింది. దేహమంతా చెమటలు క్రమ్మినయి. ప్రాణాలు అయినారు అయిపోయినయి. వస్తూ వస్తూ ఉన్న పిశాచము నిలబడిపోయి, అటూ, ఇటూ దిక్కులుచూస్తూ ఉంది. అదివరకటిదాకా నన్ను చూడలేదుగాబోలు. ఇప్పుడు చూసి ఏంజేస్తుందోనని మరింత భయమయింది. మా యిలవేలుపుభూతనాయకుడు తలపుకు వచ్చాడు. "మహాప్రభో! ఈపిశాచం బారినుంచి యివ్వాళ నన్ను తప్పించితే యీ సంవత్సరము నీకల్యాణమహోత్సవము నే నొక్కడనే కావించుతాను. 'రావే యీశ్వర, కావవే వరద సంరక్షించు భద్రాత్మకా'" అని మ్రొక్కుకొన్నాను.

ఇంతలో ఆ పిశాచము నెమ్మదిగా చావడి గుమ్మముదగ్గరకు పోతూఉన్నట్లు కనిపించింది. లోకనాథుడు నా ఆర్తనాదము విన్నాడు. నా గౌరీపతి నన్ను కరుణించాడు. తలుపుగొళ్లెము కదిలింది. తలుపులు కిఱ్ఱుమన్నయి. పిశాచము లోనికి పోయింది, నాకు ఊపిరాడింది.

వెంటనే వేయిఆలోచనలు తగిలినయి. "అస లది భూతమేనా? కాకపోతే అర్ధరాత్రి వేళ ఎందుకు తిరుగుతుంది? అయితే గొడ్ల చావడిలో ఏమిపని? "..."చెట్టుక్రింద పేడ దిబ్బదగ్గర ఏమిటి వెతికింది?"..."ఆఁ..." గొబ్బున నా కొక ఆలోచన తట్టింది. ధైర్యముగా లేచి కూర్చున్నాను. కాసేపటిలో పిశాచము బయటికి వచ్చి చంకలోనుంచి ఏదో దించి తలుపు గొళ్లెముపెడుతుంది. బాగా తేరిపారజూశాను. పిశాచాలకుమల్లే పాదాలు వెనకకు తిరిగిలేవు. బాగా ధైర్యము చిక్కింది.

"ఎవ రామనిషి ?"

ఆవ్యక్తి చప్పున వెనక్కి తిరిగిచూశింది. పోలికలు తెలియవచ్చినయి. ధైర్యము చిక్కబడ్డది.

"ఏమది మాట్లాడవు?" అంటూ తొందరగా లేచి దగ్గరకుపోయాను. ఆమనిషి తల వంచుకుంది.

"ఏం సుబ్బమ్మా? ఏంపొయ్యేకాలము వచ్చింది? దొంగప్రొద్దున ఎందు కిట్లా వచ్చావు?"

"................"

"పగలంతా బజారునపోయే గొడ్ల పేడంతా చాలక దొంగవేషాలు మొదలుబెట్టావు! ఇట్లా అయితే ఆసామీ యేమికాను? బలే పనేలే, పదపద. ఆపేడ అక్కడ వేసి మరి కదులు. సుబ్బమ్మ సుబ్బమ్మ అంటే ఏమో ననుకున్నా, బలే సుబ్బమ్మవే!"

"కాదన్నయ్యా, ఆవైపు......"

"ఛా, అన్నయ్యాఅంటావు! ఏభయ్యేళ్లు తొక్కవు, నీకు అన్నయ్యనా నేను ?"

"......కాదండీ. పడమటిబజారున బళ్లు విడిస్తే అక్కడ తుక్కూ దూలూ కాస్త పోగుజేసి, ఈబజారున ఒకకడి దొరుకుతుందేమో నని యిట్లా వచ్చాను."

"వచ్చినదానివి దారిని పోక దొడ్లోకి పోయిన దెందుకు? నీవు ఏరుకువచ్చిన పేడ అందులో వేద్దామనా? వీలయితే లోకుల సొమ్ము వేసుకుపోదామనా? చాల్లే పద."అని నే నివతలికి వచ్చేశాను.

"మఱ్ఱిచెట్టులో దయ్యమంటే యిదే కామను. దయ్యము దయ్యమంటే భయమే పెద్దదయ్యము. వెనకటికి శాస్త్రము చెప్పినట్లు అనుమానమే పెనుభూతము." అని అనుకొంటూ నెమ్మదిగా ఇంటికి పోయి పండుకున్నాను. పండుకున్నానేగాని నిద్ర రావటము లేదు. సుందరమ్మమాత్రము విసుకుకుంటూ వచ్చి తలుపుతీసి ఒకప్రక్కన మంచం పట్టెను కరచుకుని నిద్రపోతున్నది.

"రోజూ, సుందరమ్మదగ్గర అంత ధైర్యముగా మాట్లాడేవాణ్ణి. ఇవ్వాళ ఎంతపని అయిందీ" అని నవ్వుకొని సిగ్గుపడ్డాను.

మళ్లా(సిగ్గుపడటమువలనగాబోలు) నన్ను నేనే సమర్థించుకున్నాను.

"ఇవ్వాళ నాఅదృష్టము మంచిదయి అది సుబ్బమ్మ అయిపోయిందిగాని, అసలే దయ్యాలు లేవనటాని కెట్లా వీలు? దయ్యాలే లేకపోతే ఉన్నవని చెప్పటానికి ఇంగ్లండులో Conon Doyle వాళ్లూ, నమ్మటానికి కడమవాళ్లందరూ పిచ్చివాళ్లా?......" అని అనుకునేవరకు కొంచెము మతి చలించింది. పట్టెను ఒత్తుకొని పండుకున్న సుందరమ్మను దగ్గరకు తీసుకున్నాను. "ఇప్పుడు దయ్యా లుంటేమాత్రము న న్నేం జేస్తవిలే" అనుకొంటూ.......నిద్రపోయాను కామన్ను, కళ్లు తెరచి చూసేవరకు అప్పటి కప్పుడే తెల్లవారిపోయింది.